
# పెనుభూతం



**తిరుమలశ్రీ**

**వంశీ మోనికను ప్రేమించాడు. మోనికకు ఇరవై ఏళ్ళుంటాయి. అందగత్తె. టీవీ యాంకర్ ఆమె. ఓ సామాన్య కుటుంబానికి చెందినది.**

**టీవీ స్క్రీన్ మీద మోనికను చూసిన వంశీ తొలి చూపులోనే మనసు పారేసుకున్నాడు. పాతికేళ్ళ వంశీ ఇంజనీరు. ఆరడుగుల పొడవుంటాడు. తెల్లగా, హ్యాండ్సమ్‌గా వుంటాడు. కలవారి కుర్రాడు.**

మోనిక తండ్రి ఓ ప్రయివేట్ కాలేజీలో లెక్చరర్. తల్లి హౌస్‌వైఫ్. ఇద్దరు కూతుళ్ళు, ఓ కొడుకూను వారికి. మోనికే పెద్దది. మర్యాదైన కుటుంబం.

వంశీ మోనిక తల్లిదండ్రులను కలుసుకున్నాడు. తనను తాను పరిచయం చేసుకుని, మోనికను తాను గాఢంగా ప్రేమిస్తున్న విషయం చెప్పాడు. ఆమెకూ ఇష్టమైతే పెళ్ళిచేసుకుంటానన్నాడు.

అతని వివరాలు తెలుసుకున్న మోనిక తల్లిదండ్రులకు అటువంటి యోగ్యుడైన అల్లుడు లభించడం తమ అదృష్టంగా అనిపించింది. అంతకంటె గొప్ప సంబంధం తాము తేలేరు. తేవాలనుకున్నా కట్న పిశాచి కోరలు చాచి తమను అడ్డుకుంటుంది. వంశీ రూపం, వినయవిధేయతలూ ఆకట్టుకున్నాయి వారిని. పైగా ప్రేమా దోమా అంటూ ఆడపిల్లల వెంటబడి వేధించి తల్లిదండ్రులు ఒప్పుకోకపోతే లేపుకుపోవడానికి వెనుకాడని నేటి యువత పోకడల నేపథ్యంలో వంశీ తిన్నగా తమ దగ్గరకు వచ్చి తన మనసులోని మాటను వెల్లడించడమూ వారి అనుమతి కోరడమూ అతని ఉన్నత వ్యక్తిత్వానికి గీటురాయిలా అనిపించింది.

వంశీ ప్రతిపాదన ఆనందం కలిగించినా, ఆనందంతోపాటు ఆలోచనలను కూడా రేకెత్తించింది వారిలో. సువాసనలీనే మొగలిపూవుకు ముళ్ళు వున్నట్టే, అందంతోపాటు అహంకారమూ వుంది మోనికకు. అందం, అహంకారం తోబుట్టువులు అన్నారెవరో. అందానికి అహంకారం అలంకారమనుకుంటే ఆ అలంకారం కొంచెం అతిగానే వుంది ఆమెకు. దానికి తోడు షార్ట్ టెంపర్డ్‌నెస్ ఒకటి. కోపం ముక్కుమీదుంటుంది. అది ముందు ముందు అత్తవారింట్లో ఆమెకు ఏం సమస్యలు తెచ్చిపెడుతుందోనని భయపడుతుంటారు. అంతేకాదు, దుస్తుల మీద కొంచెం అతిగానే ఖర్చు చేస్తుంటుంది మోనిక.

అదే విషయం దాచకుండా వంశీకి చెప్పారు వాళ్ళు. వారి నిజాయితీకి ముగ్ధుడయ్యాడతను. అందగత్తెకు ఆమాత్రపు అహంకారం అలంకారమే అవుతుంది. షార్ట్ టెంపర్డ్‌నెస్ అంటారా ముక్కు మీద కోపం ముఖానికే అందం అన్నాడు వెనుకటికి ఓ కవి. ఇకపోతే ఖర్చు విషయమంటారా, తన ఆనందం కోసం నా ఆస్తినంతా వెచ్చించడానికైనా నేను సిద్ధమే. మోనికలోని లోపాలను వోవర్ లుక్ చేయగల శక్తి నా ప్రేమకు వుంది" అని జవాబిచ్చాడు.

మోనికకు వంశీ నచ్చాడు. అయితే కొద్దిరోజులపాటు అతన్ని స్టడీ చేయాలనుకుంది. ఆ తరువాతే ఎంగేజ్‌మెంట్.

వంశీ తల్లిదండ్రులకు కూడా మోనిక నచ్చడంతో వారి వివాహానికి గ్రీన్ సిగ్నల్ వెలిగింది.

వంశీ, మోనికలు తరచు కలుసుకునేవారు. సినిమాలకూ, షికార్లకూ వెళుతు[illegible]రు. గిఫ్ట్స్ ఎక్ఛేంజ్ చేసుకునేవారు. వారిని చూసి ముచ్చటైన జంట అనుకుని మురిసిపోయేవారు ఇరువురి తల్లిదండ్రులూను.

ఓ రోజు సాయంత్రం మోనిక వంశీకి ఫోన్ చేసింది. ఇంట్లో తాను ఒక్కతే వుందనీ, ఒంటరితనంతో బోర్ కొడుతోందనీ కంపెనీ కోసం అతన్ని రమ్మనీను. వంశీ, మోనిక ఇంటికి చేరుకునే సరికి ఏడయింది.

రెండు నిముషాలపాటు బెల్ కొట్టినా ఎవరూ రాకపోవడంతో జారవేసి వున్న తలుపు తోసుకుని లోపలకు ప్రవేశించాడతను.

హాల్లో లైట్ వెలుగుతోంది. "మోనికా" అంటూ పిలిచాడు. జవాబు లేదు.

మోనిక బెడ్‌రూమ్‌లో లైటు కనిపించింది. సంశయిస్తూనే అటువైపు నడిచాడు. లోపలి నుంచి సన్నటి కూని రాగం వినిపిస్తోంది. అడుగు పెట్టాడు. వెనుక నుంచి అమాంతంగా ఆమెను వాటేసుకున్నాడు "సారీ ఓ వయ్యారీ! నా పేరేమిటో చెప్పాలి?" అంటూ.

ఉలిక్కిపడిందామె. లంగా, బ్రాలతో అర్ధనగ్నంగా వుంది. అతని గాఢాలింగనంతో ఆమె మేను గాలి సోకిన, వర్షపు చినుకులతో తడిసిన పూపొదలా పరవశంతో జలదరించింది. బలమైన అతని బాహువుల క్రింద నలిగిపోతున్న బింకమైన వక్షోజాలు తీయగా మూలిగాయి. అతని కౌగిట్లో బందీకాగా, ఏదో తెలీని అనుభూతితో తనువెల్లా పులకించిపోయింది. వివశయై శిరస్సును అతని కంఠానికి ఆన్చి అర్ధనిమీలిత నేత్రాలతో అలాగే

వుండిపోయింది. అతను సైతం వెచ్చటి ఆ నూతన స్పర్శకు పరవశుడై మైమరచిపోయాడు.

అయితే అది క్షణికం మాత్రమే. ఆమె అర్ధ నగ్నంగా వుందన్న సత్యం స్ఫురించడంతో అతని వివేకం వెన్నుదట్టింది. చటుక్కున ఆమెను వది లేశాడు.

సిగ్గుతో తన వైపు తిరిగిన ఆమె వదనం చూసి పక్కలో పామును చూసినట్టు త్రుళ్ళిపడ్డాడు.

గదిలో ట్యూబ్‌లైట్ వేసిందామె.

ఆమె మౌనిక కాదు. ఓ అపరిచిత యువతి.

తెల్లగా, షో కేసులో బొమ్మలా వుంది. ఇంచు మించు మౌనిక వయసు, ఎత్తే వుంటుంది. అందం కంటే ఆకర్షణ ఎక్కువ ఆమెలో. ఆ అర్ధనగ్న దుస్తులలో మగతనాన్ని సవాలు చేసేటట్టుంది ఆమె రూపం.

"సారీ, మౌనిక అనుకున్నాను" తడబడ్డాడు వంశీ.

"పరవాలేదు లెండి" నవ్వింది ఆమె. "మౌనిక కజిన్‌ని నేను. ఇంత క్రితమే పూరి నుంచి వచ్చాను."

"మౌనిక!?"

"మౌనిక ఇంట్లో లేదు. పది నిముషాల క్రితం టీవీ స్టేషన్ నుంచి ఫోన్ వస్తే వెళ్ళింది."

తనను రమ్మని చెప్పి మౌనిక వెళ్ళిపోవడమూ, ఆ విషయం తనకు ఫోన్ చేసి చెప్పకపోవడమూ కించిత్తు చికాకు కలిగించింది అతనికి. అటువంటి ఎంబరాసింగ్ సిట్యుయేషన్‌కి గురిచేసినందుకు ఆమె మీద కోపం కూడా వచ్చింది. మరోసారి ఆ యువతికి సారీ చెప్పి వెళ్ళబోయాడు.

అతని దారికడ్డంగా నిలిచింది ఆమె. తన అర్ధనగ్న శరీరాన్ని కప్పుకోవడానికి ప్రయత్నించ లేదు. సరిగదా అతన్ని మరింత తాకుతూ నిలుచుంది. "ఇంట్లో ఒక్కతెనూ వుండాలంటే బోర్. మౌనిక వచ్చేంతవరకు నాకు కంపెనీ ఇవ్వకూడదూ మిస్టర్ హ్యాండ్సమ్?" అంటూ అతని వీపు చుట్టూ చేతులు పెనవేసి అతని వక్షానికి అతుక్కుపోయింది.

ఎదురుచూడని ఆమె వింత ప్రవర్తనకు కంగారు పడ్డాడు వంశీ. ఆమెను విడిపించుకో బోయాడు. మరింతగా అతనికి హత్తుకుపోయి అతని ముఖమంతా ముద్దులతో ముంచెత్తింది. ఆమె చేష్టలు తన మగతనాన్ని సవాలు చేస్తుంటే, కష్టం మీద తనను తాను నిగ్రహించుకున్నాడు వంశీ. అతనిలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఆమెను బలవంతంగా విడిపించుకుని చెంప చెళ్ళుమనిపించాడు.

ఆమె కళ్ళల్లో నీరు గిర్రున తిరిగింది. "డామిట్! కోరివచ్చిన ఆడదాన్ని కాదని తోసిపారేసే నువ్వేం మగాడివి?" అంది ఉక్రోషంగా.

"షటప్! మగాళ్ళంతా మగువల కొంగు తగిలితే పొంగిపోయే బలహీనులనుకోకు. నీలాంటి వగలాడులు ఎందరు ప్రయత్నించినా నాలాంటి వాళ్ళను సెడ్యూస్ చేయలేరు. క్యారెక్టర్ కోల్పోతే సర్వం కోల్పోయినట్టే. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని నీ పద్ధతి మార్చుకో" కోపంగా అని, ఆమెను పక్కకు తోసేసి విసురుగా వెళ్ళబోయాడు.

## తడి



**కంట్లో తడి ఉంటే**
**మనసు వేదన పడుతున్నట్టు,**
**మేఘంలో తడి ఉంటే**
**వర్షం వర్షిస్తున్నట్టు**
**భూమిలో తడి ఉంటే**
**మొలకలకు స్పందన చేరినట్లు**
**కత్తికి తడి అంటితే**
**ద్వేషం రగులుతున్నట్టు!!**

**- జి. శైలూషి**

అదే క్షణంలో చప్పట్లు కొడుతూ గుమ్మం వద్ద ప్రత్యక్షమైంది మౌనిక.

"వెల్ మిస్టర్ వంశీ! నా పరీక్షలో నెగ్గావు. కంగ్రాట్స్!" అంది. ఆమె వదనంలో ఆరాధన మెదిలింది.

తెల్లబోయి చూశాడు వంశీ. "వాడ్డూయూ మీన్?" చిన్న పలుకులు అప్రయత్నంగా అతని నోటి నుంచి వెలువడ్డాయి.

"ఎస్. అందంగా కనిపించే ప్రతి పుష్పంపైనా బెదురు లేకుండా వాలే తుమ్మెదలాంటి మగాడి క్యారెక్టర్ మీద నాకు నమ్మకం తక్కువ. నా భర్త నన్ను తప్ప అన్యకాంతల వంక కన్నెత్తి చూడ్డం కూడా నేను సహించలేను. అందుకే మీకు ఈ చిన్న పరీక్ష పెట్టాను" నవ్వుతూ వివరించింది మౌనిక.

"మిమ్మల్ని రమ్మని చెప్పి నా స్నేహితురాల్ని రంగంలోకి దింపాను. నేను దాక్కుని నా ఫ్రెండ్‌ని మీ మీదకు వదిలాను. యూ హావ్ వన్ ది టెస్ట్. ఇక మన ఎంగేజ్‌మెంట్‌కి ఎటువంటి ఆటంకమూ లేదు."

ఆమె పలుకులకు నిర్ఘాంతపోయాడు వంశీ. తేరుకోవడానికి కొంత సమయం పట్టింది. ఆమె వంక తీక్షణంగా చూసి విసురుగా బయటకు వెళ్ళిపోయాడు.

మూడు రోజులుగా వంశీ, మౌనికను కలవ లేదు ఆమె ఫోన్ చేసినా రెస్పాన్స్ లేదు. అలిగాడనుకుంది. అందమైన ఆడపిల్లపట్ల మగాడి అలక ఎంతసేపులే అనుకుంది.

నాలుగో రోజున కొరియర్‌లో వచ్చిన ఉత్తరం చదివి నిశ్చేష్టురాలయింది మౌనిక. అది వంశీ రాసిన ఉత్తరం.

"మిస్ మౌనికా!అహంకారి అయిన ఆడదాన్ని భరింపవచ్చును. ముక్కోపితో సర్దుకుపోవచ్చును. దుబారా మనిషిని బేర్ చేయవచ్చును. కానీ అనుమానపు భార్యతో జీవితం పంచుకోవాలనుకోవడం కోరి కొరివితో తల గోక్కోవడమే అవుతుంది. దాంపత్య చక్రంలో ఇరుసులాంటివి భార్యాభర్తలకు ఒకరిపై ఒకరికి వుండే నమ్మిక, విశ్వాసం. ఆలుమగల మధ్య అవి లోపించినపుడు బ్రతుకులు నరకమయమవుతాయి. జీవితాలు నాశనమవుతాయి. అందుకే అనుమానం పెనుభూతమన్నారు. ఆ పెనుభూతాన్ని చేజేతులా నెత్తికెక్కించుకోవడం కంటే నా ప్రేమను చంపుకోవడమే ఉత్తమమనిపిస్తోంది. మగవాళ్ళంతా నీతిలేనివారనుకోవడం మనో అపరిపక్వతను చాటుతుంది. నువ్వు నాకు పెట్టిన శీల పరీక్ష నీ అహంకారానికి గీటురాయి అని సరిపెట్టుకోబోయినా, నీ అనుమానపు జాడ్యం నన్ను భయపెడుతోంది. అందుకే మన పరిచయానికి ఈ ఫుల్‌స్టాప్."

కిటికీలోంచి వీచిన గాలి కెరటానికి వెలవెలపోయిన వదనంతో చలనరహితంగా వుండపోయిన మౌనిక చేతిలోంచి ఎగిరిపోయింది వంశీ లేఖ. ❋

## ఉత్తరాలు



### సంచిక బాగుంది

27.7.05 సంచికలో మండాది గోపీనాథ్ గారి కవిత 'రెండు జీవితాల తీరు' ఎంతో బాగుంది. జాలి, కరుణ నిండిన మనసు లోంచి పుట్టిన భావమది. అలాగే, జనవరి ఒకటవతేదీ ప్రారంభం బాగుంది. కనుమరుగవుతున్న పిచ్చుకలు వ్యాసం చక్కగా ఉంది.

*- దేవరపల్లి ఉషారాణి, సూర్యాపేట*

### ఆసక్తికరంగా ఉంది

శ్రీమతి సువర్నాకన్నన్‌గారి సీరియల్ ప్రియనేస్తం మన ప్రియదత్తకు ప్రియనేస్తం. ఆమె కలం నుండి జాలువారుతున్నవి అమృత బిందువులు. కథలు, సీరియల్స్, వ్యాసాలు, శీర్షికలు, వారఫలాలు, గళ్ళనుడి కట్టండి, వంటలు ఈ ఏడును శారదా మందిరమున కుసప్త కవాటకములు. దీనిని ప్రచురించిన సంపాదకులకు పాఠకులకు నా ఆసక్తికర ఆనంద దాయక శుభాకాంక్షలు.

*- గంగరాజు మోహనరావు, తిరునిండ్రవూరు*

### మీరేకావాలి కథలో...

మీరేకావాలి కథలో (20.7.05) అంధుడైన మాస్టారు లాస్యప్రియతోపాటు ఇంకోరు వచ్చారని ఎట్టా గ్రహించాడు అని అబ్బుర పడ్డాడు పినాకపాణి. ఇందులో అబ్బురపడేది ఏమీలేదు. పంచేంద్రియాలలో ఒకటి (చూపు) తక్కువ కావటంవల్ల అంధులు మిగతా ఇంద్రియాలపై ఎక్కువగా ఆధారపడ్డారు. చెవుల ద్వారా సూక్ష్మమైన శబ్దాన్ని అయినా అడుగుల సవ్వడిని బట్టి గ్రహిస్తారు.

*- కె. రామారావు, హైదరాబాద్*